
### ధీరోదాత్తుని కథగా

# దేవర




ప్రకటన నాటినుంచి నేటి ప్రమోషన్స్ వరకూ ఎప్పటికప్పుడు ఎన్టీఆర్ 'దేవర-1'పై అంచనాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. రీసెంట్‌గా విడుదల చేసిన 'చుట్టమల్లె..' సాంగ్ వ్యూస్ ఇప్పటికే కోటి దాటిపోయాయి. కొరటాల శివ ప్రెస్టేజియస్‌గా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. వివక్షకు, అణచివేతకు గురవుతున్న తనవారికి అండగా నిలబడి, ధర్మసంస్థాపన చేసిన ఓ ధీరోదాత్తుని కథగా 'దేవర'ను కొరటాల శివ రూపొందిస్తున్నారు. తీరప్రాంత నేపథ్యంలో సాగే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. వచ్చే నెల 27న సినిమా విడుదల కానుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ ఆలీఖాన్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు కెమెరా: రత్నవేలు, సంగీతం: అనిరుధ్, నిర్మాతలు: సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, నందమూరి కల్యాణ్‌రామ్.

## ఒక్కడిగానే పోరాడాలి!



ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకాభిమానం చూరగొన్న 'ది లయన్ కింగ్' సిరీస్‌లో భాగంగా రాబోతున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. డిసెంబర్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. వివిధ భారతీయ భాషల్లో కూడా ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు. సినిమాలోని ప్రధాన పాత్ర ముఫాసాకు అగ్ర హీరో మహేష్ బాబు వాయిస్ ఓవర్ అందిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం తెలుగు వెర్షన్ ట్రైలర్ విడుదల చేశారు. 'అప్పుడప్పుడూ ఈ చల్లనిగాలి.. నా ఇంటి నుంచి వచ్చే జ్ఞాపకాలను గుర్తుచేస్తున్నట్లు అనిపిస్తుంది. అంతలోనే మాయమవుతుంది', 'మనం ఒక్కడిగా పోరాడాలి..' అంటూ మహేష్ బాబు చెప్పిన సంభాషణలు ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి. తాను ఎంతగానో ఇష్టపడే పాత్రకు డబ్బింగ్ చెప్పడం ఆనందంగా ఉందని మహేష్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమాలో మరో రెండు పాత్రలకు బ్రహ్మానందం, అలీ డబ్బింగ్ చెప్పడం విశేషం.

## రజనీకాంత్ 'కూలీ'లో అతిథిగా



లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో ఆమిర్‌ఖాన్.. గత కొన్ని రోజులుగా విపరీతంగా వైరల్ అవుతున్న వార్త ఇది. అందులో నిజం లేకపోలేదు. కాకపోతే కాస్త టైమ్ పడుతుంది అంతే. అయితే.. ఈ లోపు లోకేశ్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఓ సినిమాలో ఆమిర్‌ఖాన్ ప్రత్యేక పాత్ర పోషించనున్నారు. ఆ సినిమా ఏదో కాదు. రజనీకాంత్ 'కూలీ'. ముందు కొసరుగా 'కూలీ'లో నటిస్తారు ఆమిర్‌ఖాన్. తర్వాత అసలు సినిమా మొదలవుతుందన్నమాట. ఇదిలా వుంటే.. కమల్‌హాసన్ 'విక్రమ్'లో రోలెక్స్ అంటూ సినిమా చివర్లో సూర్య పాత్రను పరిచయం చేసి థియేటర్లు దద్దరిల్లిపోయేలా చేశారు లోకేశ్ కనకరాజ్. ఇప్పుడు ఆ మ్యాజిక్‌ని 'కూలీ'లో ఆమిర్‌ఖాన్‌తో రిపీట్ చేస్తారా? అన్నది తెలియాల్సివుంది. పూణేలో మంగళవారం ఈ సినిమా షూటింగ్ మొదలైంది. మరి ఆమిర్ ఆగమనం ఎప్పుడో తెలియాల్సివుంది.

## కథలోనే కావాల్సినంత ఎమోషన్ ఉంది

**'నానితో సినిమాలు చేస్తే ప్రొడ్యూసర్‌కి టెన్షన్ ఉండదు'. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత డీవీవీ దానయ్య అన్నమాట ఇది. నిజమే.. కథను ఓకే చేయడం.. షూటింగ్ టైమ్‌లో ప్రతీది దగ్గరుండి చూసుకోవడం.. ప్రమోషన్‌లో అన్నీ తానై సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లడం.. నిజానికి ఇంత ఇన్వాల్వ్ అయ్యే హీరోలు ఇండస్ట్రీలో అరుదే. అందుకే నిర్మాతలకు నాని నిజంగా స్పెషల్. ఆయన 'సరిపోదా శనివారం' సినిమా రేపు (గురువారం) విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో నాని ముచ్చటించారు.**

- 'శనివారం దుష్టసంహారం'.. ట్రైలర్‌లోనే ఆ పాయింట్ చూపించాం. ఈ కథలో నాకు నచ్చింది కూడా అదే. దాన్ని ప్రేక్షకులకు నచ్చేలా చెప్పామా? లేదా? అనేది రేపు థియేటర్లలో చూస్తారు. 'సరిపోదా శనివారం' మంచి కథ. కథలోనే కావల్సినన్ని ఉద్వేగపూరితమైన మూమెంట్స్ ఉన్నాయి. వాటిని వందశాతానికి తీసుకెళ్లాం. ఇందులో యాక్షన్ పార్ట్ 20శాతమే. మిగతా 80శాతం యాక్షన్ మూడ్‌లో ఉంటుంది. ఆ మూడ్‌నే ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు. సూర్య, దయ, చారులత.. ఈ ముగ్గురు మధ్య సాగే కథ ఇది. ఈ ముగ్గురికీ సోకులపాలెం అనే ఊరికి ఉన్న సంబంధం ఏమిటి? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన బలం. జనరల్‌గా నా సినిమాలన్నింటిలో తెలియని ఓ బరువును మోస్తుంటా. ఈ సారి మాత్రం ఆ బరువును ఎస్.జె.సూర్య, దర్శకుడు వివేక్ ఆత్రేయ మీద వేసేశా. నేను కొంచెం బ్యాక్ సీట్ తీసుకున్నా.



- ఎస్.జె.సూర్యతో ఎంజాయ్ చేస్తూ నటించా. నటుడిగా ఆయన్నుంచి చాలా నేర్చుకున్నా. ఆ రోల్‌కి ఆయన తప్ప మరో ఛాయిస్ లేదు. తన పాత్రకు ఏడు రోజులు డబ్బింగ్ చెప్పారు. అద్భుతంగా వచ్చింది. అలాగే ప్రియాంక, మురళీ శర్మ కూడా కథను మోసే పాత్రలే చేశారు. ఈ సినిమాలో వేస్ట్ కేరక్టర్ కనిపించదు.
- ముఖ్యంగా దర్శకుడు వివేక్ ఆత్రేయ గురించి చెప్పాలి. చాలామందికి నచ్చేలా తను 'అంటే సుందరానికి' తీశాడు. కానీ కొన్ని కారణాల వల్ల సరిగ్గా ఆడలేదు. దాంతో 'నేను సరిగ్గా చేశానా?' అనే డౌట్ అతనిలో ఉండేది. అలాంటి సమయంలో తన బలాన్ని తనకు గుర్తు చేస్తూ నేను తన పక్కన ఒక బ్రదర్‌లా ఉన్నా. నా నమ్మకాన్ని నిజం చేస్తూ టెర్రిఫిక్ సినిమా తీశాడు. ఈ కథకు సీక్వెల్ కూడా చేయొచ్చు.
- సినిమా తీయడం ఒకెత్తు అయితే.. దాన్ని జనాల్లోకి తీసుకెళ్లడం ఒకెత్తు. నిజానికి కంటెంటే సినిమాను చూసుకుంటుంది. అయితే అది రిలీజ్ తర్వాత. ముందు సినిమాను జనాల్లోకి తీసుకెళ్లాలి. అందుకే ప్రమోషన్ విషయంలో అగ్రెసివ్‌గా ఉంటా. నేను హీరోగా చేసే ప్రతి సినిమాకూ అసిస్టెంట్ డైరెక్టర్‌లా పని చేస్తా. నా నిర్మాతలు హ్యాపీగా ఉండాలని కోరుకుంటా. సినిమా విడుదలయ్యాక అందరూ హ్యాపీగా ఉన్నారని తెలిసిన తర్వాత సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తా.

## నాన్‌స్టాప్ కామెడీ హంగామా



సుహాస్, సంగీర్తన జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకుడు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. పెళ్లయినప్పటికీ పిల్లలు వద్దనుకుంటాడు హీరో సుహాస్. అందుక్కారణం ఖర్చులు బాగా పెరిగిపోతాయని అతని భయం. పిల్లల్ని కనమని కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా అతను ససేమిరా అంటుంటాడు. ఈ నేపథ్యంలో తన భార్య గర్భవతి అని తెలిసినప్పుడు హీరో ఏం చేశాడు? ఆ తర్వాత జరిగిన పరిణామాలేమిటి? అనే అంశాలతో ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. చక్కటి వినోదాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ప్రతి ఒక్కరికి నచ్చుతుందని, నాన్‌స్టాప్ కామెడీతో మెప్పిస్తుందని దిల్‌రాజు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్.

## 'అమ్మ' అసోసియేషన్‌కు రాజీనామా



మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదిక అక్కడి ఇండస్ట్రీని కుదిపివేస్తున్నది. మలయాళ పరిశ్రమలో మహిళలు లైంగిక వేధింపులతో పాటు పారితోషికాల్లో వివక్ష, షూటింగ్ లొకేషన్లలో కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హేమ కమిటీ నివేదికలో పేర్కొంది. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు మోహన్ లాల్ అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (AMMA) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు మొత్తం 17 మంది పాలక మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రస్తుతం ఈ సంఘటన మలయాళ ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. కమిటీలోని కొంతమంది సభ్యులపైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దీంతో వారందరూ రాజీనామా చేసినట్లు తెలిసింది. రెండు నెలల్లోగా కొత్త పాలక మండలిని ఎన్నుకుంటామని అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. 'అమ్మ' సంఘంలో సభ్యులుగా ఉన్న దర్శకుడు రంజిత్, నటులు సిద్ధిఖీ, బాబురాజ్, జయసూర్య, ముఖేష్, సూరజ్ వెంజారమూడులపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి.

## వినోదాత్మక కథతో 'భలే ఉన్నాడే'



'ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. కథలో చాలామంచి ఎమోషన్స్ ఉంటాయి. దర్శకుడు శివసాయి నేను పనిచేసిన దర్శకుల్లో వన్ ఆఫ్ ది బెస్ట్ డైరెక్టర్. తాను ఈ సినిమాను మలచిన తీరు అద్భుతం. దర్శకుడి విజన్‌కి తగ్గట్టు నిర్మాత కూడా సహకరించడం వల్లే సినిమా బాగా వచ్చింది. కథానాయిక మనీషా కంద్కూర్ చక్కగా పెర్ఫార్మ్ చేసింది. శేఖర్ చంద్ర బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. మారుతీగారితో ఎప్పట్నుంచో పనిచేయాలని ఉండేది. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. అందరూ కలిసి చూడదగ్గ సినిమా ఇది.' అని రాజ్ తరుణ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'భలే ఉన్నాడే'. జె.శివసాయివర్ధన్ దర్శకుడు. ఎన్వీ కిరణ్‌కుమార్ నిర్మాత. అగ్రనిర్మాత మారుతి సమర్పకుడు. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజ్‌తరుణ్ మాట్లాడారు. 'అమ్మాయిలకు చీరకట్టే వాళ్లను శారీ డ్రాపర్స్ అంటారు. ఇందులో రాజ్‌తరుణ్ శారీ డ్రాపర్‌గా నటించారు. అమ్మాయిలకి చీరకట్టాలంటే ఓ కంఫర్ట్‌బుల్ లెవల్ ఉండాలి. దాని ప్రకారం రాజ్‌తరుణ్ లుక్‌నీ, బిహేవియర్‌ని డిజైన్ చేశా. తను ఎందుకలా ఉన్నాడనేది సెప్టెంబర్ 7న తెరపై చూస్తారు.' అని దర్శకుడు చెప్పారు. ఇంకా కథానాయిక మనీషా కంద్కూర్, నిర్మాత కిరణ్‌కుమార్, సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర కూడా మాట్లాడారు.



## మా నాన్న సూపర్‌హీరో

సుధీర్‌బాబు హీరోగా రూపొందుతోన్న ఎమోషనల్ డ్రామా 'మానాన్న సూపర్‌హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకుడు. వి సెల్యులాయిడ్స్, సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణపూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్నది. దసరా కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ మంగళవారం ప్రకటించారు. కుటుంబ ప్రేక్షకులను ఆకర్షించే కంటెట్‌తో తెరకెక్కుతున్న ఈచిత్రానికి దసరా బెస్ట్ సీజన్ అనీ, ప్రేమ, అనుబంధాల నిజమైన అర్థాన్ని తెలుసుకోడానికి ఓ తండ్రీకొడుకులు చేసిన ప్రయాణమే ఈ సినిమా కథని మేకర్స్ తెలిపారు. ఆర్ణ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సాయిచంద్, సాయాజీ షిండే, రాజు సుందరం, శశాంక్, ఆమని, అన్నీ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ కల్యాణి, సంగీతం: జైక్రిష్.

## వెలకట్టలేని అభిమానం



ఇటీవల విడుదలైన 'మిస్టర్ బచ్చన్' సినిమాలో తన అందచందాలతో యువ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది మరాఠీ భామ భాగ్యశ్రీ బోర్సే. ఒక్క చిత్రంతోనే యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ సొగసరికి తెలుగులో భారీ అవకాశాలొస్తున్నాయి. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించనుంది. దీంతో పాటు దుల్కర్ సల్మాన్ సినిమాలో కూడా ఈ భామ నాయికగా ఖరారైందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలి చిత్రంలోనే తెలుగు ప్రేక్షకులు తనపై అభిమానాన్ని చూపించారని, ఓ ఫ్యామిలీ మెంబర్‌లా చూసుకున్నారని భాగ్యశ్రీ ఆనందం వ్యక్తం చేసింది. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. ''మిస్టర్ బచ్చన్' చిత్రంలో జిక్కీ పాత్ర ఎంతగానో నచ్చిందని నాకు సందేశాలు పంపిస్తున్నారు. మీ ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. ఇండస్ట్రీలో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నా తదుపరి సినిమాల గురించి ఆసక్తికరమైన విషయాలను మీతో పంచుకోవాలని ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. ఆ విషయాలను త్వరలో వెల్లడిస్తా' అని పేర్కొంది.



## నిరుద్యోగి ప్రేమప్రయాణం

గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ నిరుద్యోగ యువకుని ప్రేమప్రయాణమే ప్రధానాంశంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఈసారైనా?!'. విప్లవ్ స్వీయదర్శకత్వంలో నిర్మిస్తూ, నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటిపాటను ఇటీవలే మేకర్స్ విడుదల చేశారు. రాకేందుమౌళి రాసిన ఈ పాటను తేజ్ స్వరపరిచారు. అర్జున్ విజయ్ ఆలపించారు. భావోద్వేగాల మేలుకలయికగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. అశ్విని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రదీప్ రాపర్తి, మహబూబ్ బాషా, కార్తికేయ దేవ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: గిరి, సహనిర్మాత: సంకీర్త్ కొండా.